కేటీఆర్ నాయకత్వంలో అగ్రగామిగా సిరిసిల్ల

- బీఆర్ఎస్‌వై పట్టణాధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వై పట్టణాధ్యక్షుడు మనోజ్‌కుమార్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 21: బీఆర్ఎస్ హయాంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్ల రాష్ట్రంలోనే అగ్రగామిగా అభివృద్ధి సాధించిందని బీఆర్ఎస్‌వై పట్టణాధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత సిరిసిల్ల రూపురేఖలు మారిపోయాయని, బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంల ఆర్డర్లతో చేతినిండా పనిదొరికిందన్నారు. కాంగ్రెస్ నాయకులు సీఎం మెప్పు పొందేందుకే పరిమితమయ్యారని, ఆ పార్టీలో ఉన్న పద్మశాలీ నాయకులు ఒక్కరైనా పద్మశాలీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారా..? అని ప్రశ్నించారు. బతుకమ్మ చీరల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణి కోరినట్లు చెప్పారు. పదేండ్లు బీఆర్ఎస్‌లో ఉండి ప్రభుత్వంలో పదవులు అనుభవించిన గడ్డం నర్సయ్య, ఎన్నికల టైంలో కాంగ్రెస్‌లో చేరి తమ నాయకులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈలలు వేస్తే పనులు కావనే విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలని హితవుపలికారు. నాయకుడు అంటే ప్రజల మద్దతుతో గెలవాలన్నారు. బతుకమ్మ చీరల ముఖ్య ఉద్దేశం కార్మికులకు చేతినిండా పని కల్పించడమేనని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలా ఉందో..?, 11 నెలల కాంగ్రెస్ పాలనలో ఎంతటి దుర్భర పరిస్థితి వచ్చిందో ప్రజలు గమనించాలన్నారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ నేతలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మెట్ట రాజు, మునీర్, మన్సూర్, షాదబ్, ఇమ్రాన్, పవన్, బట్టు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప అభిషేక పూజ

హోమం చేస్తున్న మాజీ ఎంపీపీ దంపతులు

ముస్తాబాద్, నవంబర్ 21: మండల కేంద్రంలోని మద్దికుంట మాజీ సర్పంచ్ జనగామ భాగ్యశ్రీ, మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు స్వగృహంలో గురువారం అయ్యప్ప స్వామి అభిషేకోత్సవం, హోమం వైభవంగా జరిగింది. జనగామ శరత్‌రావు దంపతులు ఏటా వారి స్వగృహంలో అయ్యప్ప పూజతో పాటు సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం పంపిణీ చేస్తారు. అందులో భాగంగానే రాజు గురుస్వామి, శ్యాంసుందర్‌శర్మ, మెట్ట రామశర్మ ఆధ్వర్యంలో అభిషేకోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వివిధ మండలాల మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిబ్బంది రారు.. రిపేర్ చేయరు

- విద్యుత్ సరఫరాలో సమస్యలు వచ్చినా స్పందించని సెస్ అధికారులు
- రైతులే మరమ్మతులు చేసుకోవాల్సిన దుస్థితి
- మండిపడుతున్న కర్షకులు

అడవిపదిరలో విద్యుత్ వైర్లను సరిచేసి కర్రలను అమర్చుతున్న రైతులు

వీర్నపల్లి, నవంబర్ 21: సెస్ నిర్వహణ గాడి తప్పుతున్నది. అధికారుల అలసత్వం.. పట్టింపులేమితో అధ్వానంగా మారుతున్నది. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాల్సిన సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. తీగలు లూజ్ అయినా, సరఫరా నిలిచిపోయినా స్వయంగా రైతులే మరమ్మతులు చేసుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇందుకు అడవి పదిర గ్రామంలో రైతు ఈటిక్యాల లక్ష్మీరాజం పొలంలో వదులుగా ఉన్న తీగలతో సరఫరా నిలిచిపోవడం, సిబ్బందికి సమాచారం ఇచ్చిన పట్టించుకోకపోవడంతో రైతులే స్వయంగా రిపేర్ చేసుకోవడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. వివరాల్లోకి వెళితే.. రైతు ఈటిక్యాల లక్ష్మీరాజం పొలంలో విద్యుత్ వైర్లు వేలాడుతూ చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఇటీవల వీచిన గాలికి వైర్లు ఒకదానికొకటి తాకి నిప్పురవ్వలు చెలరేగగా, పొలంలోని పశుగ్రాసం దగ్ధమైంది. అలాగే వ్యవసాయ మోటర్లకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఇదే లైన్‌కు గ్రామ పంచాయతీకి సంబంధించి బోరు మోటర్ కనెక్షన్ ఉండడం, కరెంట్ లేకపోవడం గ్రామంలో మంచినీటి కటకట మొదలైంది. విద్యుత్ నిలిచిపోయిన విషయమై రైతులు సెస్ సిబ్బందికి సమాచారమిచ్చినా స్పందించలేదు. రెండ్రోజులైనా మరమ్మతులు చేయకపోవడంతో రైతులే ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి విద్యుత్ వైర్లను సరిచేశారు. తాత్కాలికంగా కర్రలను అమర్చి సరఫరాను పునరుద్ధరించారు. అధికారులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని, మరీ ఇంత అలసత్వమా..? అని రైతులు మండిపడ్డారు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సెస్ ఇన్‌చార్జి ఏఈ రమేశ్‌ను ఫోన్‌లో సంప్రదించగా, అడవిపదిరలో సెస్ సిబ్బంది సరిగా పనిచేయడం లేదని తమ దృష్టికి వచ్చిందని, అసిస్టెంట్ హెల్పర్‌ను మార్చాలని ఎండీకి నివేదించామని, మిడిల్ పోల్స్, లూజ్‌వైర్లు సరిచేయడానికి నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

సైన్స్ టాలెంట్ టెస్టులతో మేథో వికాసం

వీర్నపల్లి: విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

ముస్తాబాద్, నవంబర్ 21: సైన్స్ టాలెంట్ టెస్టులతో విద్యార్థుల మేథో వికాసం పెరుగుతుందని ఎంఈవో రాజిరెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైన నామాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు లిఖిత ,శ్రీనిధి,సాయి కృష్ణను పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహా రాజు, అధ్యాపక బృందం అభినందించింది.

గంభీరావుపేట, నవంబర్ 21: మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ విద్యాలయంలో విద్యార్థులకు గురువారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల విభాగం నుంచి ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలు ఎంపికయ్యారు. వీరికి మండల విద్యాధికారి సంటి గంగారాం ప్రశంస పత్రాలతోపాటు బహుమతులను అందించి అభినందించారు.

వీర్నపల్లి, నవంబర్ 21: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పోటీలు దోహదపడుతాయని ఎంఈవో తుమ్మ శ్రీనివాస్ సూచించారు. వీర్నపల్లిలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఆదర్శ, జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఇక్కడ జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి నాగిల్ల రమేశ్, మండల ఇన్‌చార్జి కులేరి ప్రేమ్‌సాగర్ ఉన్నారు.

ఇల్లంతకుంట, నవంబర్ 21: మండలకేంద్రలోని విద్యా వనరుల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన పొత్తూరుకు చెందిన వివేకానంద పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల ఇల్లంతకుంట, రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. టాలెంట్ టెస్టులతో విద్యార్థులకు మేధాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పావని, తిరుపతి, మండల బాధ్యులు మహేశ్ చంద్ర, అనిల్ కుమార్ ఉన్నారు.

రుద్రంగి, నవంబర్ 21: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను జడ్పీ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమ్మిరెడ్డి అభినందించారు. ప్రశంస పత్రం అందజేశారు.

పవర్‌లూం కార్మికులకు ఉపాధి చూపాలి

- చేతినిండా పని కల్పించి ఆత్మహత్యలు నివారించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్

కలెక్టరేట్, నవంబర్ 21: సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల వరుస ఆత్మహత్యల నివారణ కోసం ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, తక్షణమే చేతినిండా పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కరెంటు సమస్యతో సతమతమవుతూ పని లేక పవర్‌లూం కార్మికులు చనిపోతుంటే ఉపాధికి భరోసా ఇవ్వాల్సిన, ధైర్యం చెప్పాల్సిన సీఎం రేవంత్ రెడ్డి, రెండ్రోజుల కింద వేములవాడ పర్యటనలో మళ్లీ పాత ప్రకటనలే గురించే చెప్పి వెళ్లిపోవడాన్ని చూస్తే నేతన్న బతుకుపై ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. సిరిసిల్ల బీవైనగర్ షాదీఖానాలో రెండ్రోజుల పాటు జరిగిన సీపీఎం జిల్లా మహాసభల్లో ప్రజా సమస్యలపై పోరాడేందుకు 24 తీర్మానాలు చేశామని, వాటి అమలు కోసం దశలవారీగా పోరాటాలు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

నూతన జిల్లా కమిటీ

సీపీఎం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మూశం రమేశ్ తెలిపారు. జిల్లా కార్యదర్శిగా మూశం రమేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జవ్వాజి విమల, మల్లారం అరుణ్ కుమార్, సభ్యులుగా గన్నారం నర్సయ్య, ఎర్రవెల్లి నాగరాజు, సూరం పద్మ, ముక్తికాంత అశోక్, మల్లారపు ప్రశాంత్, గురజాల శ్రీధర్, అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, రమేశ్ చంద్ర ఎన్నికయ్యారని వెల్లడించారు. ముగింపు సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ స్కైలాబ్ ప్రసంగించారు.

ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదు

- ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా దశల వారీగా హామీలు నెరవేరుస్తాం
- ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

గంభీరావుపేటలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గంభీరావుపేట, నవంబర్ 21: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రజలకు చేసిన వాగ్దానం మేరకు ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయామని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టుకుని దశల వారీగా ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గంభీరావుపేటలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం నివాసంలో గురువారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందు నిలిపేందుకు కృషిచేస్తామని వివరించారు.అంతకు ముందు లింగన్నపేటలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మామ మాదవరావు దశ దిన కర్మలో మంత్రి పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ హన్మయ్యగౌడ్, నేతలు హమీద్, హన్మాండ్లు, శ్రావణ్‌కుమార్, ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్కూళ్ల బంద్ సరికాదు

వేములవాడ, నవంబర్ 21: వేములవాడలో రెండ్రోజుల కింద సీఎం రేవంత్ పర్యటన సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు బంద్ చేయించడం అన్యాయమని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సామల్ల సాయి భరత్, కడారి శివ మండిపడ్డారు. సీఎం సభకు జన సమీకరణ కోసం ప్రైవేట్ బస్సులను తీసుకొని పాఠశాలలకు సెలవులు ఇవ్వడం, దీనికి బదులుగా రెండో శనివారం స్కూళ్లు నడుస్తాయని విద్యాధికారి పేర్కొన్నారని, ఇది ఎంత వరకు సమంజసమన్నారు. కొన్ని పాఠశాలలను నడిపించి, మరి కొన్నింటికి సెలవు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల గురించి సీఎం మాట్లాడకపోవడం తీవ్ర నిరాశపరిచిందని, వాటిని ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల పక్షాన మాట్లాడుతున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదనే విషయాన్ని నాయకులు గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికుమార్, విజయేంద్ర శివసాయి, అశ్విన్, అఖిల్, ప్రభాస్ ఉన్నారు.

బీడీ కార్మిక మహాసభను జయప్రదం చేయాలి

చందుర్తి, నవంబర్ 21: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 24న జరిగే బీడీ కార్మిక రెండో మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా బాధ్యులు కడారి రాములు కోరారు. గురువారం చందుర్తిలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పాత పద్ధతిలో లాగ నేరుగా డబ్బులు ఇవ్వాలని, అర్హులకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, బాలరాజు, టేకుమల్ల సమ్మయ్య, గుంటి వేణు, గోవర్ధన్, సుతారి రాములు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణు, అనసూర్య, వినోస్, భూమవ్వ, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా నాగరాజు

కోనరావుపేట, నవంబర్ 21: సుద్దాలకు చెందిన ఎర్రవెల్లి నాగరాజు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

'సీఎం గిరి వికాసాన్ని' వినియోగించుకోవాలి

కోనరావుపేట, నవంబర్ 21: గిరిజన పోడు రైతులు అందరూ సీఎం గిరి వికాసం పథకాన్ని వినియోగించుకోవాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోతు నరేష్‌నాయక్ సూచించారు. కమ్మరిపేట తండాలో గిరిజన రైతులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.50లక్షలు మంజూరు చేసిందని, ఈ పథకం కింద భూమి చదును చేయడం, బోరు మోటార్ పంప్‌సెట్, కరెంట్ సరఫరా వంటి వాటిని చేస్తారని చెప్పారు. నిధుల విడుదలకు సహకరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నాయకులు దేశాయినాయక్, తిరుపతి, రాజు, లక్ష్మీబాయి ఉన్నారు.

ప్రతిభా పాటవ పోటీలు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 21: చిన్మయ గీతా పఠన పోటీలు-2024లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్, రెయిన్ బో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు భగవద్గీతలోని శ్లోకాలపై పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా విభజించి విజేతలకు చిన్మయ మిషన్ సభ్యులు బహుమతులు ప్రధానం చేశారు. విజేతలు వచ్చే నెల 1న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఇక్కడ నల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబర్ 21: కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయం గురువారం కిక్కిరిసింది. జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో రద్దీ కనిపించింది. ఈ సందర్భంగా ఉదయాన్నే ధర్మగుండంలో స్నానం చేసిన భక్తులు, కోడె మొక్కు చెల్లించుకొని స్వామివారి దర్శనానికి బారులు తీరారు. గర్భగుడిలో అభిషేక, అన్న, ఆకుల పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. రాజన్నను దాదాపు 15 వేల మంది దర్శించుకున్నారని, ఆలయానికి రూ.14 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

వివాహ వేడుకలో 'చల్మెడ'

వేములవాడ పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో మచ్చ కిషన్- పద్మ దంపతుల కుమారుడు మాధవ్ వివాహం శివానితో గురువారం జరిగింది. వేడుకకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు జిందం చక్రపాణి, మాదాడి గజానందారావు, శ్రీనివాస్, రాంబాబు ఉన్నారు.
- వేములవాడ, నవంబర్ 21

వధూవరులను ఆశీర్వదిసున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, నవంబర్ 21: మైనార్టీ సంక్షేమ శాఖ రాజన్నసిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో మైనారిటీ యువతకు గ్రూప్-2 పరీక్ష కోసం రెండు ఫుల్ లెంత్ మాక్ టెస్టులు రాసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఆర్‌వి రాధాబాయి తెలిపారు. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీయులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టి సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 29లోగా సమర్పించాలని సూచించారు. ప్రథమ మాక్ టెస్ట్ డిసెంబర్ 2, 3, ద్వితీయ మాక్ టెస్ట్ డిసెంబర్ 9, 10న ఉదయం 10.30 సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందని, వివరాలకు మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బాలకృష్ణ

గంభీరావుపేట, నవంబర్ 21: గంభీరావుపేటకు చెందిన యెల్లె బాలకృష్ణ రాష్ట్ర పద్మశాలి సంఘ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్యకు బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కాటన్ పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, నవంబర్ 21: ప్రభుత్వం కాటన్ పరిశ్రమ కోసం ఆర్డర్లు ఇవ్వాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ కోరారు. గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పాలిస్టర్, కాటన్ పరిశ్రమలో ఉపాధి లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా కాటన్, పాలిస్టర్ మిలితమైన చీరలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందించాలన్నారు. యారన్ డిపో ద్వారా కాటన్ సంబంధిత యారన్‌ను అందించాలన్నారు. సమావేశంలో నాయకులు గౌడ రాజు, గౌడ వాసు, గౌడ సురేష్, యెల్లె దేవదాస్, గాజుల రవి ఉన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం

సిరిసిల్ల టౌన్, నవంబర్ 21: సిరిసిల్ల మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీసి స్థానిక గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. జిల్లా సంఘం భవనం కోసం స్థలం కేటాయించాలని, చేపల వేటకు వెళ్లేవారికి వాహనాలు, వలలు, తెప్పలు, డబ్బాలు, తదితర వస్తువులు ఇవ్వాలని కోరారు. పేద విద్యార్థులు వసతి గృహం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు వంగళ రాజనర్సు, పట్టణాధ్యక్షుడు ముడారి చిన్న, కూరపాటి శ్రీధర్ ఉన్నారు.

రాజన్న కోడెలకు ఎనిమిది ట్రాక్టర్ల గడ్డి

రాజన్న కోడెలకు ట్రాక్టర్లలో గడ్డి తీసుకెళ్తున్న రైతులు

ముస్తాబాద్, నవంబర్ 21: పోతుగల్ గ్రామానికి చెందిన యువ రైతులు వేములవాడ రాజన్న కోడెల కోసం ఎనిమిది ట్రాక్టర్ల గడ్డిని గురువారం అందజేశారు. ట్రాక్టర్లలో గడ్డిని తీసుకెళ్లి ఆలయం వద్ద పూజలు చేసి, కోడెల నిర్వహణ సిబ్బందికి అందజేశారు. కాగా, మూగజీవాలకు మేత కోసం గడ్డిని అందించడం అభినందనీయమని పోతుగల్ మాజీ సర్పంచ్ తన్నీరు గౌతమ్ రావు పేర్కొన్నారు. గడ్డిని అందించిన దాతలను అభినందించారు. ఇక్కడ చెక్కపల్లి రాజు అక్కరాజు పర్శరాములు, ఈర్ల పెద్ద మల్లయ్య రేపాక బాల్‌నర్స, బబ్బిలి హన్మంతు, బోయ రాజేశం రైతులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

గంభీరావుపేట, నవంబర్ 21: మండల కేంద్రంలోని పీజీ కళాశాలలో ఆయా కోర్సులకు గాను డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్‌కాం, ఎమ్మెస్సీ కంప్యూటర్ పీజీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు 25వ తేదీలోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌లతో వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

మద్యానికి బానిసై వృద్ధుడి బలవన్మరణం

కోనరావుపేట, నవంబర్ 21: అనారోగ్యంతో మద్యానికి బానిసై వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిమ్మపల్లిలో గురువారం జరిగింది. ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మనుపాటి చంద్రయ్య (67) మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కరీంనగర్ దవాఖానలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. ఇంటి వద్ద ఉంటూనే మద్యానికి బానిసయ్యాడు. గతంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు కాపాడారు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని టైంలో ఉరేసుకున్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతిచెందిన తీరును పరిశీలించారు. చంద్రయ్యకు భార్య లక్ష్మితోపాటు కొడుకులు రాజు, శేఖర్, కూతురు రాజమణి ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆటో డ్రైవర్..

సిరిసిల్ల రూరల్, నవంబర్ 21: కుటుంబ కలహాలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లెల్లలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్‌కె అన్వర్ (33) కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం భార్య పిల్లలతో సహా సిద్దిపేట వెళ్లాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు కావడంతో భార్య పిల్లలను తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపానికి లోనైన అన్వర్ నాలుగు రోజుల క్రితం జిల్లెల్లకు వచ్చాడు. గురువారం గ్రామ శివారులోని రా